కవితా కౌముది

## బాల్యగీతం

పవన్ కుమార్ గజవల్లి

పాల బుగ్గలు, పసిడి మొగ్గలు,
బుంగ మూతులు, బెంగ ఏడ్పులు,
అలక పానుపులు, వంకర మూతులు,
ఆటల మూటలు, నవ్వుల రేడులు,
పిల్లల్లారా, పిడుగుల్లారా!
కూనల్లారా, మొగ్గల్లారా!
వింటారా ఇది మీ పాట!

మీదే మీదే విశాలవిశ్వం!
మీరే మీరే ప్రపంచ భాగ్యం!
మీకే మీకే జయజయ కేతనమ్!
పరుగెత్తండి, పరుగెత్తండి,
నవలోకపు ఉదయ కాంతికై,
ప్రవహించండి, ప్రవహించండి,
దాహపు గొంతుల తడి ఆరుటకై,
నినదించండి, ధ్వజమెత్తండి,
శాంతి స్వేచ్ఛల విడుదల కొరకై,
బుడుతల్లరా, పాపల్లారా!
వినండి ఇది మీపాట!

లక్క పిడతలు, గుజ్జన గూళ్ళు,
వామన గుంటలు, అష్టాచెమ్మలు,
రంగు గోళీలు, గిల్లి దండాలు,
చెమ్మ చెక్కలు, చారెడేసి మొగ్గలు

దోపుడు పుల్ల, నాలుగు రాళ్ళు,
అవ్వా అప్పచ్చా, బొమ్మరిల్లు,
బెచ్చాలు, తొక్కుడు బిళ్ళలు,
వంగుళ్ళు దునుకుళ్ళు, కోతికొమ్మచ్చులు

ముక్కు గిల్లుడు, ఒప్పుల కుప్ప,
వత్తొత్తి వారొత్తి, వెన్నె కుప్పలు,
దొంగా పోలీస్, దాగుడు మూత,
కుచి కుచి రైలు, పులీ మేక

ఆకాట, రేసాట,
జాజిరి, కోలాటం,
దస్తి బిస్తి, సెల్లెళ్ళ బండి,
నేలబండ, ఉప్పుబస్తా

ఉప్పుబేరలు, చెడుగుడు ఆట,
నాలుగు స్థంబాలు, ఏడు పెంకులు,
కప్పగంతులు, కుందుళ్ళు,
పప్పుచార్, లప్పుచార్

కికురింత, కుచ్ కుచ్ పుల్ల,
నీళ్ళు పొంగే, నిప్పులు పొంగే,
గట్టు ముందు, గట్టు వెనుక,
కుప్ప తన్నులు, కొక్కో కొక్కో

అల్లం దుర్గం, ఇల్లం దుర్గం,
పిచ్చిబంతి, రాముడు సీత,
గచ్చ కాయలు, కుర్చీలాట,
వీరివీరి గుమ్మడిపండు

పాములపట్ట, పచ్చీసుపట్ట,
స్టాచ్యూ ఆట, తొక్కుడు బిళ్ళ,
బొంగరాలు, గాలిపటాలు,
సైకిలు చక్రం, తిప్పుడు పుల్ల

భోగిమంటలు, కోడి పందాలు,
వేసవి సెలవలు, విడిది యాత్రలు,
నవమి చలువ పందిళ్ళు, సాయంకాలపు సందళ్లు,
దసరా సెలవలు, పగటి వేషాలు

కొబ్బరి పుల్లల ఇరుసులు, సీసా మూతల చక్రాలు,
అగ్గిపెట్టెల కార్లు, బంకమన్ను బండ్లు,
జీరంగి పెట్టె, రంగుల గుడ్లు,
ఆడారా మీరెపుడైనా? చూశారా మీరెపుడైనా ?
ఆడండిక ఇపుడైనా! చూడండిక ఇపుడైనా!
ఈ ఆటలు పాటలే ఆహ్లాదాలు,
రాగల కాలపు తీపి గురుతులు!
రాదు సుమా ఈ బాల్యం మళ్ళీ,
చేయకు సుమా ఈ కాలం ఖాళీ!

వానకాలువలు తీశారా?
కాగితం పడవలు వేశారా?
సబ్బు బుడగలను ఊదారా?
నీటి బంతులను చేశారా?
తీయండిక, వేయండిక, ఊదండిక, చేయండిక!

అమ్మమ్మ గారింటికి వెళ్ళారా?
పెద్దమ్మ కథలు విన్నారా?
తిరునాళ్ళను చూశారా?
రంగుల రాట్నం తిరిగారా?
వెళ్ళండిక, వినండిక, చూడండిక, తిరగండిక!

నానమ్మ పొత్తులో తిన్నరా?
జున్ను పాలను తాగారా?
మట్టి బొమ్మలను చేశారా?
దసరా వేషం వేశారా?
తినండిక, తాగండిక, చేయండిక, వేయండిక!

సాయంకాలపు స్నానాలు, చంకలేని బనియన్లు,
ఆరుబయట మంచాలు, ఆకాశంలో చుక్కలు,
పేదరాశి పెద్దమ్మ, అనగనగా ఒక రాజు,
ఆలీబాబా నలభైదొంగలు, కాశీమజిలీ కథలు,
భేతాళ మాంత్రికుడు, బాల నాగమ్మ,
తెనాలి రాముడు, పరమానందయ్య శిష్యులు,
బాల రామాయణం, బాల భారతం,
వేమన శతకం, సుమతీ శతకం,
పంచతంత్రం, బాలశిక్ష,
చందమామ, బాలమిత్ర,
జాబిల్లి, బుజ్జాయి,
చదివారా ఎపుడైనా, చదవండిక ఇపుడైనా!
విన్నారా ఎపుడైనా, వినండిక ఇపుడైనా!

రంగుల పుల్లైసులు, సేమియా సగ్గుల పాలైసులు,
నువ్వుల జీడీలు, కర కర గొట్టాలు,
తిమ్మిరి బిళ్ళలు, పంచదార గవ్వలు,

బొంబాయి పాకం, మిఠాయి చేతివాచి,
బియ్యపు చెక్కలు, కొబ్బరి లౌజులు,
నువ్వులుండలు, పల్లీ చెక్కలు,
మురుకులు, సకినాలు,
శనగవుండలు, బర్ఫీలు,
గెనుసు గడ్డలు, సజ్జ బూరెలు,
బఠాణి, శనగ గుగ్గిళ్లు,
ఉప్పు శనగలు, బొరుగు మసాల,
మొక్క జొన్నలు, సజ్జ కంకులు,
జానపళ్ళు, కలే కాయాలు,
ఉప్పుకారం మామిడి ముక్కలు,
తియ్య తియ్యని జామ పండ్లు,
చింత కుప్పలు, ఈత కాయలు,
చింత పుల్లలు, రేగి తొక్కులు,
పీచు మిఠాయిలు, పాల కొవ్వలు,
పూర్ణాలు, బందరు లడ్లు,
అరిశలు, కజ్జి కాయలు,
బొబ్బట్లు, పూతరేకులు,
పానకాలు, వడపప్పులు,
పులిహోరలు, పొంగనాలు,
దద్ధోజనం, పుల్లట్లు,
బెల్లం పూసలు, వెన్నపూసలు,
చిట్టి గారెలు, పెరుగు వడలు,
తిన్నారా ఇవి ఎపుడైనా,
తినండిక ఇపుడైనా!
ఇది తెలుగు వంటల వైభవం సుమా,
బాధ్యత వహించి రక్షించు సుమా!

★★★

## మా ఇంటి చెట్టు
## ప్రసాద్ కేశనకుర్తి

మా ఇంటి చెట్టు
మా ఇంటి ముందు ఒక చెట్టు
మౌనంగా నిలుచుంటుంది ఏమి తెలియనట్టు
కానీ దాన్ని చూసినప్పుడల్లా అనిపిస్తుంది.
మా మధ్య ఏదో బంధం ఉన్నట్టు
ఆ బంధానికి కారణం ..
తాను వీచే గాలులతో నాకు ప్రాణం పోస్తుందని కాదు.
లేక నేను విడిచే శ్వాసతో తనకి జీవం పోసుకుంటుందనీ కాదు

కదిలిపోయే మేఘాలను తన చిగురుటాకులతో చిరుజల్లుగా
మారుస్తుందని కాదు,
లేక ఎగిరిపోయే పక్షులని తన కొమ్మ రెమ్మలతో
చెంతకి చేరతీస్తుందనీ కాదు
!
కొట్టుకుపోయే మట్టిని,
తన గట్టి వేళ్ళతో కట్టిపడేస్తుందని కాదు.
చివరికి కట్టెగా మారి, కాటికి చేరిన కాయంతో తాను కూడా
కాలిపోతుందని కాదు!
మరి ఏమిటి బంధం, ఎక్కడిది ఈ అనుబంధం ..
నిశ్చలంగా నిలబడే ఆ చెట్టు తత్వం
నాకు మౌనంగా తెలియచేస్తోంది
జగమంతా వ్యాపించిన ఏకత్వం
ఈ భిన్నత్వంలోని ఏకత్వం అర్ధమైన అనుక్షణం
ఆ చెట్టుని ఆత్మీయంగా హత్తుకోవాలనే ఆశ.
తన చల్లని నీడలో ఒదిగిపోవాలనే ప్రయాస,
ఆ ఏకత్వమే మా మధ్య బంధాన్ని పెనవేసే మణిపూస!

★★★

## ప్రకృతి ఫలకం
## ఇవటూరి బాలా త్రిపురసుందరి

నింగి నిండిన నీలిమ గాఢ మౌనంలో గంభీరంగా ..
నెమలీక వన్నెలు నింపుకుని
వేలాడే మేఘాల తోరణాలు ..
నల్లమబ్బు బుగ్గ మీద నవ్వులా సాగిన వెన్నెల తీవె
నక్షత్ర భరణి వొంపిన మినుకు రవ్వలు
నిశీథినీ సీమ నగలు ..!!
.. నిశ్శబ్ద మైన మహార్ణవం ...
గాజుగోళంలో తరళించే నీలిసంద్రం .
నీహార తరంగాలు నిశ్చలంగా..
ఘనీభవించిన..శిశిర సమీరాలు
నివ్వెర పడుతూ సైకతతీరాన..
గవ్వలూ శంఖాలూ గుజ్జనగూళ్ళూ ..
నిలిచిపోయిన నౌకాయానం..
గతి తప్పి వొణికిన సరంగు గానం!!
మౌనం యెన్నిసార్లు కోట్ల జీవన రాగాలు కట్టి
తట్టి పోయేగాలితో కలసి ..నీ చెంప నిమిరి
మందహాసమై ..బుగ్గ మీద జారే కన్నీటి రాగమై
వినిపించే కథలెన్నో ..దాచుకునే గురుతులెన్నో
నిశ్శబ్దంగా వాలే సాయంత్రపు కడపటి కిరణం
దూరంగా పచ్చటి చెట్టుమీద ..
మెరుస్తూ క్షణం క్షణం
రాలేపండుటాకుల సోయగం ..
గాలివాటున ఎగిరే పతంగం ..
నిశ్శబ్దం .. మౌనం
నీడ జాడలుగా సాగే చదరంగం ***

# ఇప్పుడే..

మండవ రాఘవ రావు

## విశ్వకవి రవీంద్రుని కవితకు స్వేచ్ఛానువాదం

మిత్రమా నేను పోయాక నాకు తెలియదు
నీ కంటినీరు! ఇపుడే రానీ నీ అశ్రు ధారలు నాకు!
నేను పోయాక చూడను నీవు పంపే బంతిపూలు!
ఇపుడే పంపు వాటిని చూసి సంతోషిస్తా!
మిత్రమా నేను పోయాక వినను నీ పొగడ్తలు!
యిపుడే పొగడు వింటాను తనివి తీరా!
నేను పోయాక మన్నిస్తావు నా తప్పులు,
అప్పుడు నాకు తెలియదు! ఇపుడే మన్నించూ!
మిత్రమా నేను పోయాక కోల్పోయిన నన్ను
వెదికితే నాకు తెలియదు: ఇపుడే రా వచ్చి కలువు!
నేను పోయాక మించిపోయిన సమయానికి
విచారించేకంటే ఇదే సమయం, రావా?
మిత్రమా నేను పోయాక వెదుక్కుంటూ వస్తావు
నాయింటికి సంతాపం చెపటానికి! మాటే లేదు
మన మధ్య ఏళ్ళుగా! నా వైపు చూడు! నా మాట
విను! మాట్లాడు ఇప్పుడు మన బాల్య స్మృతులు!
ఇరుగు పొరుగులకు హితులకు స్నేహితులకు
సమయమివ్వు చేయి చేయి కలుపు:
చేయి చిరుసాయం:
చిరు నగవుల చిందించు:
రేపేమి జరుగునో కదా!
నేడు జీవించి పరవశించు!
ఒక్కడినే చెప్పగలను, మాట్లాడుకోలేం గదా!
ఒంటరిగా సంతోషించగలను,
మనంకలస్తే సంబరం!
ఒక్కడినే చిరునవ్వు, కలసి గలగలా నవ్వగలం!
ఒంటరి గా సున్నా, మందతో కలిస్తే మార్బలం!
అదే అదే మహత్యం! మానవ సంబంధాలు
ప్రకృతి పరిరక్షణ, పరస్పర సహాయం
మానవ మనుగడకే మూలం! తోడు తోడుగ
కలసి మెలసి వుంటే కలదు సుఖం!
అదే అదే మహత్యం! మానవ సంబంధాలు
ప్రకృతి పరిరక్షణ, పరస్పర సహాయం
మానవ మనుగడకే మూలం! తోడు తోడుగ
కలసి మెలసి వుంటే కలదు సుఖం!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

హిమసుమమ్ములు నను స్పృశియించి వెడలె
మరల వచ్చెదమని నాకు మాట యిచ్చె
ఎదురు చూతును వచ్చునదెప్పుడంచు
కనుల కనిపించి యంతలో కరిగిపోవు

ఎంత శీతలమైన హృదంతరమున
కెంత యానందమును గూర్చునీ హిమమ్ము
పుడమి ధవళంపు మైపూత తొడగినంత
నా సొబగునెన్ననెవ్వరికైన తరమె

ఎచటికి వెడలలేక పోయినను గాని
జారు హిమకణమ్ముల గవాక్షములనుండి
పొడగనిన యంత హృదయముప్పొంగిపోదె
ఎంత జూచిన కనులకు తృప్తి గలదె

కరగిపోవునీ దృశ్యము కనుల ముందె
ఇంత యానందమెచటికో యెగిరిపోవు
అంతలో గోచరమగు వసంతహేల
మానసమునకు మరల సమ్మదము గూర్చ

ఒక సుఖము కనుమరుగైననోర్మి వలయు
ఇంక దుఃఖమే యంచు చింతింపవలదు
తిరిగి వేరొక ముదమరుదెంచగలదు
మరలనానంద ఘడియలు వరల గలవు

COMMENTS